


పోలమాంబ ఘటాలకు పూజలు

మక్కువ : చదురుగుడిలో కొలువై ఉన్న శంబర పోలమాంబ అమ్మవారి ఘటాలకు మహిళలు మంగళవారం అధిక సంఖ్యలో పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పసుపు, కుంకుమ, చీరలు చూపించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ నెల 22 నుంచి జాతర ప్రారంభం కానుండడంతో అధికారులు ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నారు. గ్రామంలో వివిధ శాఖల అధికారులతో ఆర్డీవో హేమలత మంగళవారం సమీక్షించారు. జాతరకు పటిష్ట బందోబస్తు కల్పించాలని ఏఎస్పీ సునీల్‌సోరెన్ పోలీసు అధికారులను ఆదేశించారు.



సిద్ధమవుతున్న వేదిక



బొబ్బిలి గర్జనకు రా.. కదిలిరా!

- హాజరుకానున్న టీడీపీ అధినేత చంద్రబాబు
- శ్రేణులు, అభిమానులు భారీగా తరలివచ్చే అవకాశం
- సభకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిన పార్టీ నాయకులు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు వాగ్బాణాలు సంధించనున్నారు. బొబ్బిలి వేదికగా గర్జించనున్నారు. ఆయన మాటల తూటాలను స్వయంగా వినాలని తహతహలాడుతున్న తెలుగు తమ్ముళ్లు, అభిమానులు కదిలి వచ్చేం దుకు కంకణబద్ధులయ్యారు. కొద్ది గంటల్లో బొబ్బిలిలో రా కదలిలా సభ ప్రారంభం కానుంది. ఈ వేదికకు బొబ్బిలి గర్జనగా నామకరణం చేశారు. చంద్రబాబు సభపైకే అందరి దృష్టి మళ్లింది. కోకొల్లలుగా ఉన్న వైసీపీ ప్రభుత్వ బాధితులు, విసిగిపోయిన ప్రజలు కొత్తదనం కోరుకుంటున్నారు. వారంతా సభకు తరలివచ్చే అవకాశం ఉంది. అందుకు తగినట్లు టీడీపీ నాయకులు ఏర్పాట్లు చేశారు.



బేబీనాయనతో మాట్లాడుతున్న ఏఎస్పీ ఆస్మాఫర్హీన్

ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో టీడీపీ రా.. కదలి రా.. పేరుతో ప్రజా చైతన్య సదస్సులు నిర్వహిస్తోంది. పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ప్రతి జిల్లాలో సభలకు హాజరవుతున్నారు. అందులో భాగంగానే బొబ్బిలికి బుధవారం వస్తున్నారు. విజయనగరం డివిజన్లో ఇటీవల యువగళం యాత్ర ముగింపు సభ విజయవంతంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. లక్షలాదిగా జనం హాజరయ్యారు. ఆ సభతో తెలుగు తమ్ముళ్లు మంచి జోష్‌తో ఉన్నారు. ఇదే ఉషారు కొనసాగాలని అధినేత ఆకాంక్షిస్తూ బొబ్బిలి సభకు వస్తున్నారు. మరోవైపు ఇటీవల కాలంలో బొబ్బిలి ప్రాంతం నుంచి అత్యధికంగా టీడీపీ తీర్థం పుచ్చుకుంటు న్నారు. వారంతా వైసీపీ నుంచి వచ్చిన వారే. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం, అణచివేతలు, వేధింపులు, కక్ష సాధింపులపై విసుగుచెంది వచ్చామని వారంతా ప్రకటించారు. అన్ని వర్గాల్లోనూ వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉంది.

రా.. కదలిరా సదస్సుల్లో వైసీపీ ప్రభుత్వ విధానాలను చంద్రబాబు ఎండగడుతున్నారు. రాజధాని లేని రాష్ట్రంగా మార్చేసి, రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం చేశారని ప్రతి సమావేశంలో వివరిస్తున్నారు. పక్కనున్న తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ మాదిరిగా అమరావతిని తీర్చి దిద్దనున్నట్లు స్పష్టం చేస్తున్నారు. పరిశ్రమలను స్థాపించి ఉపాధి అవకాశాలు మెరుగు పరిచి స్థానికంగానే ఉపాధి, ఉద్యోగ అవకాశాల ద్వారా యువతకు ధీమా కల్పిస్తున్నారు. ఇలా స్థానిక సమస్యలు ప్రస్తావించడం.. స్థానిక వైసీపీ నేతలు చేస్తున్న దందాలను ఎండగడుతున్న నేపథ్యంలో బొబ్బిలిలో జరిగే చంద్రబాబు పర్యటనపైనే జిల్లా వ్యాప్తంగా చర్చ సాగుతోంది.

సభకు ఏర్పాట్లు పూర్తి..

బొబ్బిలి, జనవరి 9: బొబ్బిలి రాజా కళాశాల మైదానంలో బుధవారం జరగనున్న టీడీపీ బొబ్బిలి గర్జన సభకోసం ఆ పార్టీ నాయకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రా కదలిరా నినాదంతో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు బొబ్బిలి బహిరంగ సభలో ప్రసంగించనున్న సంగతి తెలిసిందే. విజయవాడ విమానాశ్రయంలో ఆయన బుధవారం ఉదయం 10.15 గంటలకు బయలుదేరి విశాఖ ఎయిర్‌పోర్టుకు 11 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయం 11.50 గంటలకు బొబ్బిలి రాజా కళాశాల మైదానానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంటన్నర వరకు బహిరంగ సభలో చంద్రబాబు పాల్గొంటారు. మధ్యాహ్నం 2.45 గంటలకు తిరుగు ప్రయాణమై కాకినాడ జిల్లా తుని మండలం చామవరం బహిరంగసభకు హాజరవుతారు.

- బొబ్బిలి రాజా కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సభాస్థలి, హెలిపాడ్‌ను మంగళవారం జిల్లా అడిషనల్ ఎస్పీ ఆస్మాఫర్హీన్, బొబ్బిలి డీఎస్పి శ్రీధర్, సీఐలు ఎం.నాగేశ్వరరావు, తిరుమలరావులు పరిశీలించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్‌వీఎస్‌కెకె రంగారావు (బేబీనాయన)తో అడిషనల్ ఎస్పి చర్చించారు. జన సమీకరణ, వాహనాల పార్కింగ్ తదితర అన్ని అంశాలపై ఆమె ఆరా తీశారు. సభాస్థలిలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. హెలిపాడ్ కోసం మైదానాన్ని చదును చేశారు. బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు కూడా నిర్వహించారు.

ఎన్టీఆర్ స్ఫూర్తితోనే గర్జన

- టీడీపీ నేతలు కిమిడి కళావెంకటరావు, కూన రవికుమార్



బొబ్బిలి కోటలో విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

బొబ్బిలి/విజయనగరం రూరల్, జనవరి 9: అన్న నందమూరి తారకరామారావు పిలుపునిచ్చిన తెలుగుదేశం పిలుస్తోంది రా కదలి రా నినాదం స్ఫూర్తితో బుధవారం బొబ్బిలిలో నిర్వహించనున్న చంద్రబాబు సభకు బొబ్బిలి గర్జనగా పేరు పెట్టుకున్నామని టీడీపీ నేతలు కిమిడి కళావెంకటరావు, కూన రవికుమార్, ఆర్‌వీఎస్‌కెకె రంగారావు (బేబీనాయన) తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక దర్బారు మహల్‌లో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు సభకు లక్షలాదిగా జనం తరలి వస్తారని చెప్పారు. రాష్ట్రంలో పాలనపై ప్రజలంతా విసిగిపోయి ఉన్నారని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ ప్రజాస్వామ్యాన్ని తడిగుడ్డతో హత్య చేశాడని దుయ్యబట్టారు. మహిళలపై అత్యాచారాలు, ట్రాఫికింగ్, హత్యా కేసులు విపరీతంగా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. బొబ్బిలిలో జరగనున్న రా కదలి రా సభ కనీవినీ ఎరుగని రీతిలో సక్సెస్ అవుతుందన్నారు.

- టీడీపీ అధినేత చంద్రబాబు బుధవారం బొబ్బిలిలో తలపెట్టిన 'రా కదలిరా' సభపై టీడీపీ సీనియర్ నేత కళావెంకటరావు, విశాఖ జిల్లాకు చెందిన ఎమ్మెల్యే గణబాబు, విజయనగరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి అదితి గజపతిరాజులు మంగళవారం ఉదయం టీడీపీ కార్యాలయం (అశోక్ బంగ్లా)లో సమావేశమయ్యారు. విజయనగరం నియోజకవర్గం పరిధిలో విస్తృత ప్రచారం నిర్వహించామని, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారని అదితి చెప్పారు.

సిమెంట్ లెక్క తేల్చరూ....!

- నేతలు చుట్టూ పీఆర్ సిబ్బంది ప్రదక్షిణలు

నోటీసులు ఇచ్చేందుకు వెనకడుగు

రేగిడి, జనవరి 9: రేగిడి మండలంలోని 25 సచివాలయాల పరిధిలో వివిధ భవన నిర్మాణాలకు గతంలో సరఫరా చేసిన సిమెంట్ బస్తాల అంశం మండలంలో విస్తృత చర్చనీయాంశమైంది. లెక్క తేలకపోవడంపై 'ఆంధ్రజ్యోతి'లో వస్తున్న వరుస కథనాలతో పీఆర్ ఉన్నతాధికారులు సీరియస్ అయినట్లు తెలిసింది. ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, ఏఈ, డీఈఈలకు మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. నోటీసులు ఇచ్చి రికవరీకి చర్యలు చేపట్టాలన్నారు. అయితే ఈప్రక్రియలో కాస్త వెనకడుగు కనిపిస్తోంది. నోటీసులు జారీచేయకుండా నేతలను ఒప్పించి సిమెంట్ రికవరీకి చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులు యోచిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై సిమెంట్ వాడుకొన్న నేతలు పెద్దగా స్పందించడం లేదు. చేసేదిలేక సిబ్బంది ప్లీజ్.. ప్లీజ్ సిమెంట్ లెక్కలు తేల్చాలని నేతల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని తెలిసింది.

- మండలంలో 25 సచివాలయాలకు మూడేళ్ల క్రితం దాదాపు 50వేలకు పైబడి సిమెంట్ బ్యాగ్‌లు సరఫరా కాగా ఒకటి రెండు సచివాలయాలు తప్పితే మిగితా 23 సచివాలయాలకు సరఫరా అయినట్లు ఇంజినీరింగ్ అధికారులు గుర్తించారు. అయితే ఎక్కువ తక్కువ సరఫరా అయిన సిమెంట్ వ్యవహారం వల్ల కొంతమంది నష్టపోగా మరి కొంత మంది వేరే పనులకు మళ్లించుకొని గుంబనంగా ఉంటున్నారు. దాదాపు 10వేల బస్తాల లెక్కపై గందరగోళ పరిస్థితి ఉంది.

రికవరీకి చర్యలు

సిమెంట్ లెక్కలు తేల్చేపనిలో ఉన్నాం. ముందుగా స్థానిక నేతలను కలిసి వివరాలు సేకరిస్తున్నాం. ఒకటి రెండురోజుల్లో రికవరీ కొలిక్కి వస్తుందని భావిస్తున్నాం.

\- రామకృష్ణ, ఏఈ, పంచాయతీరాజ్

అదరం.. బెదరం



బొత్స ఇంటి ముందు బైఠాయించిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

- ప్రభుత్వంపై ఒకటే తెగువతో ఆందోళనలు
- బొత్స ఇంటిని ముట్టడించిన సమగ్ర శిక్ష ఉద్యోగులు
- చలిలో వణుకుతూ శిబిరంలోనే అంగన్వాడీలు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)/ కలెక్టరేట్, జనవరి 9: ఉత్తరాంధ్ర జిల్లాల్లోని సమగ్ర శిక్ష కార్యాలయాల్లో పనిచేస్తున్న వందలాది సిబ్బంది మంగళవారం విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇంటిని ముట్టడించారు. కలెక్టరేట్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. పైడితల్లి అమ్మవారి గుడి సమీపంలో ఉన్న మంత్రి ఇంటికి చేరుకున్నారు. గేట్లు నెట్టి ఇంటి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించినప్పటికీ పోలీసులు వారిని వారించారు. దీంతో గంటకు పైగా నినాదాలు చేసి నిరసన తెలిపారు. తరువాత ముఖ్య నాయకులను పోలీసులు లోపలకు పంపించారు. మంత్రి లేకపోవడంతో ఆయన కుమారుడు సందీప్‌కు వినతిపత్రం అందించారు. కాగా సమ్మెలో ఉన్న సమగ్రశిక్ష ఉద్యోగులు ప్రభుత్వ తీరుకు విసిగి తాడోపేడో తేల్చుకోదలిచారు. ఇప్పటికే వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నారు. ప్రభుత్వం బెదిరింపులకు దిగడంతో మంగళవారం మంత్రి ఇంటిని ముట్టడించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ గత కొద్ది రోజుల నుంచి నిరసన వ్యక్తం చేస్తున్నా కనీసం పట్టించుకోకపోవడం చాలా దారుణమన్నారు.

చలిలో అంగన్వాడీల నిరసన

అంగన్వాడీ కార్యకర్తలు సమ్మెను కొనసాగిస్తున్నారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు పైడిరాజు మాట్లాడుతూ సమ్మె చేపట్టి 29 రోజులైనా ప్రభుత్వం పట్టించుకోకుండా మీనమేషాలు లెక్కించడం అన్యాయమన్నారు. కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించే వరకూ సమ్మె కొనసాగుతుందన్నారు. ఇదిలా ఉండగా చలి తీవ్రంగా వణికిస్తున్నా మంగళవారం రాత్రి శిబిరంలోనే కూర్చొన్నారు. దుప్పట్లు, తువ్వాళ్లు కప్పుకుని కనిపించారు. కొందరు చలిమంట వేసుకుని సేదతీరారు.



విజయనగరం: చలిలో వణుకుతూ నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు



డోలీలో 5 కిలోమీటర్లు

ఆ గిరిజన మహిళ తీవ్ర కడుపునొప్పితో బాధపడుతోంది. ఇక భరించలేక కుటుంబ సభ్యులకు విన్నవించింది. వారు హుటాహుటిన స్థానికులను పిలిచి అందరూ కలిసి డోలీ కట్టి ఆస్పత్రికి పయనమయ్యారు. రాళ్లు.. రప్పలు.. పొదల మధ్య నుంచి ఐదు కిలోమీటర్లు నడిచారు. వెళ్తున్న క్రమంలో ఆమె కేకలను విని తల్లడిల్లిపోయారు. మండలంలోని మూలబొడ్డవర పంచాయతీ గిరిశిఖర గ్రామమైన చిట్టంపాడుకు చెందిన వివాహిత సోముల చిలకమ్మకు మంగళవారం ఎదురైన పరిస్థితి ఇది. భర్త ఎర్రయ్య కుటుంబసభ్యులు, గ్రామ యువత సహాయంతో ఆమెను మైదాన ప్రాంతమైన బొడ్డవరకు చేర్చారు. అక్కడి నుంచి 108లో ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు.

\- శృంగవరపుకోట రూరల్

ఎస్‌ఐలకు స్థాన చలనం

విజయనగరం క్రైమ్, జనవరి 9: జిల్లాలో పలువురు ఎస్‌ఐలకు బదిలీ చేస్తూ ఎస్పీ దీపిక మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. సాధారణ ఎన్నికలపై సన్నద్ధతలో భాగంగా కొద్దిరోజులుగా విభాగాల వారీగా పోలీసుల బదిలీలు జరుగుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఎస్‌ఐలకు కొత్త స్థానాలు కేటాయించారు. బదిలీ అయిన ఎస్‌ఐలు వెంటనే విధుల్లో చేరాలని ఆదేశాల్లో ఎస్పీ పేర్కొన్నారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
ఐ.దుర్గాప్రసాద్	డీటీసీ	సంతకవటి
బి.లోకేశ్వరరావు	సంతకవిటి	బుదరాయవలస
సీహెచ్ నవీన్‌పడాల్	బుదరాయివలస	సీసీఎస్, విజయనగరం
వి.అశోక్‌కుమార్	వన్‌టౌన్	ట్రాఫిక్, విజయనగరం
వి.లోవరాజు	ట్రాఫిక్	సీసీఎస్, విజయనగరం
బి సాగర్‌బాబు	టూ టౌన్	సీసీఎస్ విజయనగరం
కేవీవీ ప్రసాద్	సీసీఎస్	డీఎస్‌బీ విజయనగరం
ఎన్‌వీ గోపాలస్వామి	సీసీఎస్	డీటీసీ విజయనగరం
వి.శ్రీనివాసరావు	సీసీఎస్	డీసీఆర్‌బీ విజయనగరం
కె.తిరుమల రాజు	సీసీఎస్	పోలీస్ కంట్రోల్ రూమ్



సమీక్ష సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపిక

ఎన్నికలకు సన్నద్ధంగా ఉన్నాం

- కేంద్ర ఎన్నికల కమిషన్ సమీక్షలో

కలెక్టర్ నాగలక్ష్మి

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధంగా ఉన్నామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి స్పష్టం చేశారు. సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై కేంద్ర ఎన్నికల సంఘం విజయవాడలో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగా విజయనగరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాల్లో చేర్పులు, మార్పులు తదితర సవరణలను పారదర్శకంగా నిర్వహించినట్లు ఎన్నికల సంఘానికి వివరించారు. వివిధ స్థాయిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి.. విచారించామన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామక ప్రక్రియకు సంబంధించి కసరత్తు చేసినట్లు చెప్పారు. ప్రత్యక్షంగా పాల్గొనే పోలీస్, రెవెన్యూ తదితర శాఖల సిబ్బంది బదిలీల వివరాలు వెల్లడించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని విధాలా సన్నద్ధంగా ఉన్నామన్నారు. శాంతి భద్రతల గురించి ఎస్పీ దీపికాపాటిల్ వివరించారు.

‘బొబ్బిలి గర్జన’ తాడేపల్లికి వినపడాలి

- చంద్రబాబు ‘రా.. కదలిరా..’. సభను విజయవంతం చేయండి
- పార్టీ శ్రేణులను కోరిన టీడీపీ నాయకులు


రామభద్రపురం: పార్టీలోకి ఆహ్వానిస్తున్న బేబీనాయన


గజపతినగరం: మాట్లాడుతున్న కళా వెంకటరావు


రాజాం: మాట్లాడుతున్న కోండ్రు

రామభద్రపురం, జనవరి 9: బొబ్బిలిలో బుధవారం జరిగే చంద్రబాబు నాయుడు బహిరంగ సభకు కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలి రావాలని, ఈ గర్జన తాడేపల్లికి వినబడేలా విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన పిలుపునిచ్చారు. ముచ్చర్లవలసలో మంగళ వారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభకు టీడీపీతో పాటు జనసేన కార్యకర్తలు, నాయకులను తీసుకురావాలన్నారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మడక తిరుపతినా యుడు, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కర్రోతు తిరుపతిరావు, జిల్లా వాణిజ్య విభాగం కన్వీనర్ కనిమెరక శంకరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు కరణం విజయభాస్కరరావు, తెలుగు యువత అధ్యక్షుడు ముల్లు రాంబాబు, ఎంపీటీసీలు భవిరెడ్డి చంద్ర, భవిరెడ్డి శంకరరావు, సర్పంచ్‌లు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా... పాతరేగకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు బేబీనాయన సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి స్వాగతం పలికారు.

శృంగవరపుకోట: జిల్లా పరిధిలోని బొబ్బిలిలో బుధవారం జరగనున్న టీడీపీ అధినేత సభను విజయవంతం చేయనున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. మంగళవారం శృంగవరపుకోట శ్రీగాయిత్రి మాత ఆలయం వెనక భాగంలో ఉన్న కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గం నుంచి ముఖ్యనేతలు, కార్యకర్తలు తరలివెళుతున్నామని, చీపురపల్లి నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లేలా చూసేందుకు తనను పార్టీ పరిశీలకునిగా నియమించిందన్నారు. విశాఖ పార్లమెంటు పార్టీ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు గోరపల్లి రాము(కొత్తవలస), లగుడు రవికుమార్(జామి) నాయకులు గుమ్మడి భారతి, గొరపల్లి సుజాత, గొర్రిపాటి రమణ, పైడిబాబు, అడారి రమేష్ తదితరులున్నారు. ● **బొబ్బిలి:** స్థానిక రాజా కళాశాల మైదానంలో బుధవారం జరగనున్న టీడీపీ ‘రా.. కదలిరా..’ బహిరంగసభకు జిల్లావ్యాప్తంగా జనసేన కార్యక ర్తలంతా పెద్దసంఖ్యలో తరలిరావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాలూరు బాబు పిలుపునిచ్చారు. మంగళ వారం సాయం త్రం తన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల స మావేశంలో ఆయన మాట్లాడారు. మండల జనసేన అధ్యక్షుడు సంచాన గంగాధర్, పళ్లెం రాజా తదితరులు పాల్గొన్నారు. ●**గజపతినగరం:** బొబ్బిలిలో తలపెట్టిన రా.. కదలిరా.. భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కిమిడి కళా వెంకటరావు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక పార్టీ కార్యా లయంలో విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు హాజరు కానున్న ఈ సభకు నియోజకవర్గం నుంచి వేలాది మంది ప్రజలు తరలి వచ్చేలా సన్నద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు ఎ.లక్ష్మునాయుడు పాల్గొన్నారు. ● బొబ్బిలిలో చంద్రబాబు చేపట్టిన రా.. కదలిరా.. భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని జనసేన పీఏసీ నాయకురాలు, మాజీ మంత్రి పడాల అరుణ పిలుపునిచ్చారు. మంగళవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. అలాగే జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రాపు సురేష్ స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో బొబ్బిలి తరలి వెళ్లే విధంగా సన్నాహాలు చేపడుతున్నామని తెలిపారు. ● **గంట్యాడ:** బొబ్బిలిలో బుధవారం జరగనున్న రా.. కదలిరా.. సభను విజయవంతం చేయాలని టీడీటీ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్‌నాయుడు పిలుపునిచ్చారు. గంట్యాడలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని సుమారు ఐదువేల మందికి తక్కువలేకుండా బయలుదేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అల్లు విజయకుమార్, రంధి చినరాము నాయుడు, బూడి అప్పలనాయుడు, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విజయనగరం దాసన్నపేట: బొబ్బిలిలో బుధవారం జరగనున్న ‘రా కదలిరా’ సభకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు రానున్న నేపథ్యంలో జనసేన పార్టీ శ్రేణులు, ప్రజలు జయప్రదం చేయాలని విజయనగరంలోనిన ఆ పార్టీ నాయకుడు గురాన అయ్యలు పిలుపునిచ్చారు. మంగళవారం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎప్పుడు ఎన్నికలు వచ్చినా టీడీపీ, జనసేన సంకీర్ణానికి పట్టం కట్టేందుకు జనం సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

రాజాం: ప్రతి వార్డు నుంచి 50 మందికి తక్కువ లేకుండా బుధవారం బొబ్బిలి సభకు తీసుకురావాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ కోరారు. మంగళవారం రాజాంలోని పార్టీ కార్యాలయంలో మునిసిపాలిటీలోని వివిధ వార్డులు, నాలుగు మండలాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గం నుంచి 20 వేలు మందిని సభకు తీసుకువస్తానని హామీఇచ్చానని అందుకు అందరూ సహకరించాలని కోరారు. పార్టీ నాయకులు గట్టి భాను, సుమల వెంకట మన్మథరావు, పిన్నింటి మోహన్‌రావు, కిమిడి అశోక్‌కుమార్, నంది సూర్యప్రకాష్‌రావు, శాసపు రమేష్‌కుమార్, వంగా వెంకటరావు, గురవాన నారాయణరావు, టంకాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బైకులు ఢీ.. యువకుడి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు


భాస్కరరావు

రామభద్రపురం, జనవరి 9: రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒక యువకుడు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని పెదపల్లివీధికి చెందిన పెదపల్లి భాస్కరరావు(27) స్కూటీపై గాంధీబొమ్మ సెంటర్ నుంచి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో సాలూరు నుంచి విశాఖపట్టణం బుల్లెట్‌పై వెళ్తున్న నబ్బువరానికి చెందిన గ్రంధి లోకేష్ ఎదురెదురుగా రావడంతో బైపాస్ రోడ్డు వద్ద రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో భాస్కరరావుకు తీవ్రగాయాలు కావడంతో బాడంగి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. గండి లోకేష్‌కు గాయాలు కావడంతో రామభద్రపురం పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతునికి 3 సంవత్సరాల కిందట వివాహమైంది. భార్య జ్యోత్స్నతోపాటు రెండు సంవత్సరాల కుమార్తె ఉంది. భాస్కరరావు భార్య జ్యోత్స్న ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ చిన్నయ్య కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి మహిళ మృతి

భోగాపురం, జనవరి 9: చెరువులో పడి మహిళ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఏఎస్‌ఐ టీఎస్ఎన్ రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భోగాపురం గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీకి చెందిన పొట్రంకి కొండమ్మ(53) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. మంగళవారం వేకువజామున కాలకృత్యాలు నిమిత్తం స్థానిక సినిమా థియేటర్ ఎదురుగా ఉన్న చెరువుకు వెళ్లింది. అక్కడ ప్రమాదవశాత్తు జారి చెరువులో పడిపోయి మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి వికలాంగుడైన భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. దీనిపై మృతిరాలి భర్త కొండలరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ నుంచి జారిపడి డ్రైవర్ మృతి


వాసు


మెరకముడిదాం, జనవరి 9: ట్రాక్టర్ నడుపుతూ జారిపడి డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఎస్‌ఐ నవీన్ పడాల్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాడంగి మండలం పాల్తేరు గ్రామానికి చెందిన చొక్కాపు వాసు(33) గ్రామంలో ట్రాక్టర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఉత్తరావల్లి-బాడంగి రహదారిలో ట్రాక్టర్‌తో వెళుతుండగా ఒక్కసారిగా తూలి కిందపడ్డాడు. ఘటనలో వాసు తలకు తీవ్ర గా యం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక నుంచి ఏదైనా వాహనం ఢీ కొట్టి గానీ, ట్రాక్టర్ ఇంజన్‌లో సాంకేతిక సమస్యలు ఏర్పడి గానీ ట్రాక్టర్ నుంచి తూలి కిందపడి ఉంటాడని భావిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. భార్య అనసూయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సారా ప్యాకెట్లు స్వాధీనం

బెలగాం: పార్వతీపురం మండలం అడారు గ్రామంలో సారా అమ్ముతున్నారన్న సమాచారంతో మంగళవారం ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1700 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని, ఒకరిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఈబీ సీఐ ఉపేంద్ర తెలిపారు. అడారు గ్రామానికి చెందిన మండంగి శ్రీరాములుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, నిందితుడిని రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఎస్ఈబీ అధికారులు ఎస్‌ఐ రమణ, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

కొత్తవలస: మండలంలోని అప్పన్నదొరపాలెం పంచాయతీ జోడుమెరక గ్రామంలో ఒక వ్యక్తిని పట్టుకుని, రెండున్నర లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్టు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసినట్టు తెలిపారు.

చెరకు లారీల బోల్తా.. ట్రాఫిక్‌జాం


సంకిలి వద్ద ట్రాఫిక్ జాం దృశ్యం

రేగిడి: చిన్నయ్యపేట సెంటర్‌లో మంగళవారం స్థానిక షుగర్స్ కర్మాగారానికి వెళ్తున్న చెరకు లారీ బోల్తాపడింది. లారీ ఓ వైపునకు ఒరిగిపోయింది. ఓవర్‌లోడ్‌తో వస్తున్న లారీ సెంటర్‌వద్ద మలుపు తిప్పబోయి అదుపుతప్పింది. పాలకొండ- విశాఖ ప్రధాన రహదారిలో నిత్యం రద్దీగాఉండే చోటా బోల్తాపడడం, ఆ సమయంలో ఎవరు లేకపోవటం స్థానికులు ఊపిరి పీల్చుకొన్నారు. ● **రేగిడి:** సంకిలి ఆర్‌సీఎంచర్చ ఎదుట మంగళవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఓవర్‌లోడ్‌తో వస్తున్న చెరకు ట్రాక్టర్ బోల్తా బోల్తాపడింది. దీంతో తొట్టెలో ఉన్న చెరకు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో పాలకొండ- రాజాం రహదారిమార్గం కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. ఫ్యాక్టరీకి సమీపంలో ఈఘటన చోటుచేసుకోవటంతో యాజమాన్య సిబ్బంది అప్రమత్తమై ట్రాఫిక్ క్లియర్‌చేశారు.

మెరుగైన వైద్యాన్ని అందించండి

బాడంగి: సీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. మంగళవారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆసుపత్రి సలహా సంఘ సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ రోగులకు మంచి వైద్యం అందించడంతోపాటు ఆహారాన్ని కూడా సక్రమంగా అందజేయాలన్నారు. డాక్టర్ కాశీవిశ్వనాథ్ ఆసుపత్రిలో 4 డాక్టర్ పోస్టులు, 5 హెడ్ నర్సు పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంట జడ్పీటీసీ రామారావు, సలహాసంఘ సభ్యులు ఆవు సత్యనారాయణ, డాక్టర్లు పాల్గొన్నారు.

సిమెంట్ బెంచీల వితరణ

జామి: భీమసింగి గ్రామానికి చెందిన వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ రీజనల్ ఛైర్మన్, మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు వాకచర్ల భాస్కరరావు తన తల్లి జ్ఞాపకార్థం స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో భక్తులు కూర్చునేందుకు సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేయించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో భాస్కరరావు మాట్లాడుతూ తన తల్లి ప్రకాశమ్మ వర్ధంతిని పురస్కరించుకొని వీటిని అందించామని తెలిపారు. విన్నకోట సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సెలవులో ఎంపీడీవో

వంగర: స్థానిక ఎంపీడీవో హెచ్.శశిభూషణరావు దీర్ఘకాలిక సెలవులో వెళ్లినట్లు కార్యాలయ సూప రింటెండెంట్ త్రినాథ తెలిపారు. విధుల్లో చేరినప్పటి నుంచి ఇక్కడ తరచూ వివాదాలు జరుగుతున్న సమా చారం. దీంతోపాటు గతంలో కంచిలిలో పనిచేసిన సమ యంలో అక్కడ కొన్ని ఇబ్బందులు ఎదురై ఇక్కడకు బదిలీపై వచ్చినట్లు తెలుస్తోంది.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

శృంగవరపుకోట: శృంగవరపుకోట ఆర్టీసీ డిపో నుంచి సంక్రాంతి పండగకు హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు మేనేజర్ కె.రమేష్ తెలిపారు. ఎస్.కోట నుంచి విజయవాడ మీదుగా హైదరాబాద్‌కు ఈ నెల 10నుంచి 12వరకు అల్ట్రా డీలక్స్ బస్సులు వెళతాయన్నారు. తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ బీహెచ్ఈఎల్ నుంచి ఈ నెల 11 నుంచి 13 వరకు సాయంత్రం 6.45కు ఈ బస్సులు బయలుదేరుతాయన్నారు. సాధారణ చార్జీలను మాత్రమే వసూలు చేస్తామన్నారు.

ధాన్యం కొనుగోలులో అక్రమాలు

శృంగవరపుకోట: రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయకుండా.. ఆర్‌బీకేల సాయంతో దళారుల నుంచి ధాన్యం సేకరిస్తున్నట్టు వీరనారాయణంనకు చెందిన వైసీపీ నేత బోజంకి గోవింద ఆరోపించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ వేపాడ మండలం రామస్వామిపేట గ్రామ పరిధిలోని రైసు మిల్లుకు ధాన్యం పట్టుకెళ్లిన రైతులను తిరిగి పంపించేస్తున్నారన్నారు. మిల్లు యాజమాన్యం ధాన్యాన్ని తీసుకోకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. రైతు భరోసా కేంద్రాల్లోని అధికారులు దళారులకు సహకరిస్తుండడంతో... రైతు పేరునే కొనుగోలు చేస్తున్నట్లు చూపిస్తున్నారన్నారు. దీంతో రైతులు ఒక్కో బస్తా వద్ద ఆరు కేజీలకు పైగా ధాన్యం నష్టపోవాల్సి వస్తోందన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయండి

రాజాం: రాజాం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేలా కృషి చేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రరాజు(పీసీసీ) సూచించారు. మంగళవారం అమరావతిలో పార్టీ అధ్యక్షుడును పార్టీ రాష్ట్ర ఉపా ధ్యక్షుడు, రాజాం నియోజకవర్గ పార్టీ కన్వీనర్ కంబాల రాజవర్ధన్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నా రు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై చర్చించారు. షర్మిలను పీసీసీ అధ్యక్ష బాధ్యతలను అధిష్ఠానం అప్పగిస్తుందని, అందుకు అందరూ కష్టపడి పనిచేయాలని రుద్ర రాజు కోరారని రాజవర్ధన్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రేగిడి: ఉంగరాడమెట్ట సబ్‌స్టేషన్ నిర్వహణ ప నుల్లో భాగంగా బుధవారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటలవరకు మండలంలో విద్యు త్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ హరి మంగ ళ వారం తెలిపారు. బూరాడ, సంకిలి 11 కేవీ ఫీడర్‌లో ఉన్న 65 గ్రామాలు, రేగిడి ఫీడర్‌తో పాటు ఆర్ డ బ్ల్యుఎస్ ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

గ్రామాల పురోభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

విజయనగరం(ఆంధ్రజ్యోతి): గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు వీలుగా సమగ్ర ప్రణాళికను రూపొందించాలని జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వెల్లడించారు. మంగళవారం జడ్పీ సమావేశ మందిరంలో 2024-25 ప్రజా ప్రణాళిక రూపకల్పనకు సంబంధించి ఎంపీడీవోలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల అభివృద్ధికి గ్రామ, మండల స్థాయిల్లో పటిష్ఠమైన ప్రణాళికలు సిద్ధం చేయటం వాటి అమలు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసినపుడే చక్కని ఫలితాలు వస్తాయన్నారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన నిధులను సక్రమంగా వినియోగించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో రాజ్‌కుమార్, రాష్ట్ర కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, డీపీవో శ్రీధర్‌రాజా, ఎంపీడీవోలు, ఈఓపీఆర్డీలు పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ జాతి అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

- టీడీపీ పార్లమెంటు బ్రాహ్మణ సాధికారిత కమిటీ కన్వీనర్ రాకేష్ శర్మ


మాట్లాడుతున్న రాకేష్ శర్మ

విజయనగరం రూరల్, జనవరి 9: బ్రాహ్మణ జాతి అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ పార్లమెంటు బ్రాహ్మణ సాధికారిత కమిటీ కన్వీనర్ ఇనుగంటి రాకేష్‌శర్మ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ నాలుగేళ్ల పాలనలో బ్రాహ్మణ కార్పొరేషన్‌కు ఒక్క పైసా ఇవ్వకుండా బ్రాహ్మణులను తీవ్రంగా మోసం చేశారన్నారు. బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీకి పాలకవర్గాన్ని నియమించకుండా నాలుగేళ్లు కాలయాపన చేశారన్నారు. రామతీర్థంలో రాముని విగ్రహం ధ్వంసమై నాలుగేళ్లయినా ఎటువంటి పురోగతి లేదన్నారు. ఈ సమావేశంలో సంఘ ప్రతినిధులు వడ్డమాని శేఖర్, సుభద్ర, రవికుమార్, శ్రీనివాసరావు, వాసు, శంభునాథ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు


విలేకర్లతో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ

శృంగవరపుకోట, జనవరి 9: తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శృంగవరపుకోటలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరులకు పోటీల గురించి వివరించారు. ఈ నెల 13న మండల స్థాయిలో ఎస్.కోట, వేపాడ, ఎల్.కోట, కొత్తవలస, జామి మండల కేంద్రాల్లో ఈ ముగ్గుల పోటీలు జరుగుతాయన్నారు. 14న శృంగవరపుకోటలో నియోజకవర్గ స్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. ఈనెల 11 నుంచి శృంగవరపుకోట ప్రీమియమ్ లీగ్ (ఎస్.పీఎల్) క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలు ఈనెల 14 వరకు జరుగుతాయన్నారు. క్రికెట్ పోటీల వివరాలకు అంబటి యశ్వంత్ 9000826574 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

హక్కులను కాలరాసిన ప్రభుత్వం

- ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు


మాట్లాడుతున్న హృదయరాజు

కలెక్టరేట్, జనవరి 9: ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉపాధ్యాయుల హక్కులు, ఆత్మగౌరవాన్ని కాలరాసిందని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని ఏపీటీఎఫ్ భవనంలో జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల విలీనం వల్ల ప్రాథమిక విద్యారంగం నాశనమైందన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులను తగ్గించడంతో పేద విద్యార్థుల నాణ్యమైన విద్యకు గండి కొట్టారని ఆరోపించారు. ఉపాధ్యాయులను ప్రభుత్వ పథకాల అమలుకు వినియోగించడంతో వారి ఆత్మగౌరవం దెబ్బతిందన్నారు. చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.ఈశ్వరరావు, సీహెచ్ వెంకటరమణ, గౌరవ అధ్యక్షులు సదాశివరావు, సంఘ నాయకులు సత్యనారాయణ , సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ లారీలను ఆపేదెవరు?


బుగ్గిలోడుతో విశాఖ-అరకు ప్రధాన రహదారిపై వెళ్తున్న లారీ

శృంగవరపుకోట రూరల్, జనవరి 9 : మండలంలో ప్రతినిత్యం నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో లారీలు యథేచ్ఛగా తిరుగుతున్నా.. అడ్డుకట్ట వేసేవారు కనిపించడం లేదు. విశాఖపట్నం నుంచి లారీలు హైవే పనుల కోసం నిత్యం బుగ్గిని తెస్తున్నాయి. నిబంధ నల ప్రకారం 30 నుంచి 35 టన్నుల వరకు తేవాల్సి ఉండ గా.. రాత్రి వేళ.. వేకువజాము సమయాల్లో 55 టన్నులకు పైబడి తెస్తున్నారు. ఇది లారీల యజమానులకు కాసులు కురిపిస్తుంటే... రోడ్లు మాత్రం దెబ్బ తింటున్నాయి. ఈ మధ్య కాలంలో విశాఖ-అరుకు రోడ్డు పూర్తిగా గోతులమయంగా మారింది. క్వారీలు, క్రషర్ల నుంచి పిక్కను కూడా నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో తీసుకెళుతున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖలు చూసీ చూడనట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. ఈ తరహా లారీల యజమానులు అధికారులకు నెలవారీ మామూళ్లు సమర్పించుకోవడంతో వీరిని చూసీ చూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలు అతిక్రమించి తిరుగుతున్న లారీల విషయంలో ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

50 శాతం డిపోలకే కందిపప్పు

- సంక్రాంతి సమయంలో కోత విధించడంపై లబ్ధిదారుల నిరాశ


సంకిలిలో కందిపప్పు లేకుండా రేషన్ ఇస్తున్న ఎండీఎం ఆపరేటర్

రేగిడి: జిల్లాలో రేషన్‌డిపోల ద్వారా ఈనెలలో కందిపప్పు కోత విధించారు. ప్రస్తుతం కందిపప్పు 50శాతమే డిపోలకు చేరింది. రేగిడి, వంగర మండలాల్లో 114 రేషన్‌డిపోలకు సం బం ధించి సివిల్‌సప్లయిస్ గొడౌన్ రేగిడిలో ఉంది. లెక్క ప్రకారం రేగిడి మండలంలోని 66 డిపోలకు వందశాతం ప్రాప్తికి 21,199 కేజీలు, వంగరలోని 54 డిపోలకు వంద శాతం ప్రాప్తికి 12,569 ప్యాకెట్లు సరఫరా కావల్సిఉంది. అయితే ఈనెల 50శాతం కోత విధించడంతో రేగిడికి 10,600 (కేజీప్యాకెట్లు), వంగరకు 6,265(కేజీప్యాకెట్లు) సరఫరా అయ్యాయి. ఈ లెక్కన రేషన్‌డిపోలకు చేరగా వీటిని ఎం డీఎం ఆపరేటర్లు పంపిణీకి అవస్థలుపడుతున్నారు. ఈనేప థ్యంలో కొన్నిగ్రామాలకు పూర్తిగా పంపిణీ నిలిపివేసినట్లు సమాచారం. సంకిలి, అప్పాపురం, ఉంగరాడ రేషన్‌డిపోల్లో కందిపప్పు ఇవ్వకపోవడంతో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులకు ఫిర్యాదువెళ్లడంతో ఉంగరాడలో 50శాతం మందికి పంపిణీచేశారు. పండగపూట కందిపప్పు కోత విధించడంపై రేషన్‌లబ్ధిదారులు నిరాశ చెందుతు న్నా రు. డిపోల్లో కందిపప్పు నిండుకోవడంతో స్టాక్‌వచ్చిన కందిపప్పును ఎండీఎం ఆపరేటర్ అర కేజీ చెప్పున సర్దుబాటు చేస్తున్నట్లు సమాచారం. ఈక్రమంలో కొన్నిగ్రామాల్లో లబ్ధిదారులు నిలదీస్తున్నారు. ఉంగరాడలో చిన్నపాటి ఘర్షణ చోటుచేసుకోగా కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. కాగా ఈనెల కందిపప్పు సరఫరా 50శాతం రాగా ఈమేరకు రేషన్‌డిపోలకు సర్దుబాటుచేసినట్లు రేగిడి, వంగర సివిల్‌సప్లయ్‌గొడౌన్ ఇన్‌చార్జి బి.గోవింద రావు తెలిపారు. ఇంకా 150 కేజీల స్టాక్ ఉందని, అవసరమైనవారికి సర ఫరా చేశామని చెప్పారు. 85 శాతం డిపోలకు ఈనెల 50శాతం సరఫరా చేయ గా, స్టాక్‌లేక కొన్నిడిపోలకు ఇవ్వలేకపోయామని తెలిపారు.

స్థానికులకే టిక్కెట్ ఇవ్వాలని కోరుతున్నారు

- ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు


మాట్లాడుతున్న రఘు రాజు

శృంగవరపుకోట, జనవరి 9: ఈసారి శృంగవరపుకోట ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు స్థానికులకు అవకాశం కల్పించాలని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు వైసీపీ అధిష్ఠానం వద్ద డిమాండ్ చేస్తున్నారని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. సిట్టింగ్ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు స్థానికేతరుడైనప్పటికీ అందరం కలిసికట్టుగా పని చేసి గెలిపించామన్నారు. స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు గౌరవం ఇవ్వకపోవడంతో పాటు ప్రోటోకాల్ పాటించకపోవడంతో ఇప్పుడు స్థానిక నినాదం చేస్తున్నామని వివరించారు. నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులను బట్టి అభ్యర్థి మార్పు ఉంటుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ సండి సోమేశ్వరరావు, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి తదితరులు పాల్గొన్నారు.

జీరో టిల్లేజ్ పద్ధతిలో మొక్కొజొన్న సాగు

బొబ్బిలి, జనవరి 9: మెట్టవలస గ్రామంలో మంగళవారం జీరో టిల్లేజ్ విధానంలో మొక్కజొన్న పంట సాగు కోసం విత్తనాలు వేశారు. చోడవరపు సూర్యనారాయణకు చెందిన ఆరు ఎకరాలలో పంట సాగు చేశారు. జీరో టిల్లేజ్ పద్ధతిలో దుక్కి దున్నకుండా విత్తనాలు వేశారు. వ్యవసాయశాఖ ఏడీ మజ్జి శ్యామ్‌సుందర్ ఆధ్వర్యంలో సిబ్బంది రైతులకు సూచనలిచ్చారు. ఈ విధానంలో ఎకరాకు రూ.ఐదు వేల నుంచి రూ.ఏడు వేల వరకు ఖర్చు అవుతుందని... పంట దిగుబడి పెరుగుతుందని ఏడీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు మన బాధ్యత

లక్కవరపుకోట: ప్రతీ ఓటరు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎస్.కోట నియోజకవర్గ ఎన్నికల అధికారి సుదర్శనదొర తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కళ్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో మహామాయా కర్మాగార ఉద్యోగులతో స మావేశమయ్యారు. ఓటుహక్కు ప్రాధాన్యత గురించి వివరించారు. బారత రాజ్యాంగం ప్రవేశపట్టిన ఓటుహక్కును అందరూ బాధ్యతతో వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో క ంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ మురళీవర్మ, ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో పతకాలు

కొత్తవలస: జాతీయ స్థాయిలో నిర్వహించిన స్కైవే మార్షల్ ఆర్ట్స్ పోటీలలో కొత్తవలసకు చెందిన క్రీడాకారులు పతకాలు సాధించిననట్టు స్కైవే మార్షల్ ఆర్ట్స్ జిల్లా అధ్యక్షుడు త్రినాథరావు తెలిపారు. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు రాజస్థాన్‌లో పోటీలు జరిగాయని తెలిపారు. కొత్తవలస మండలం నుంచి 11 మంది హాజరు కాగా వీరిలో ముగ్గురికి బంగారు పతకాలు, నలుగురికి వెండి, ఏడుగురికి కాంస్య పతకాలు వచ్చాయన్నారు.

ఏపీసీపీఎస్ఈఏ కార్యవర్గం ఎన్నిక

తెర్లాం: మండల కేంద్రంలో పనిచేస్తున్న అన్ని డిపార్ట్‌మెంట్‌ల సీపీఎస్ ఉద్యోగులు హాజరై జిల్లాప్రధాన కార్యదర్శి ఎం.శ్రీరాములు ఆధ్వర్యంలో మంగళవారం స మావేశం ఏర్పరిచి ఏపీసీపీఎస్ఈఏ మండల కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షులుగా సాకేటి గణపతి, సలహాదారుగా గేదెల శంకరరావు, అధ్యక్షునిగా బూరి తవిటినాయుడు, ప్రధాన కార్యదర్శిగా బత్తిన సురేష్ తదివతరులను ఎన్నుకున్నారు.

నాడు ఆదర్శం.. నేడు అధ్వానం



నాడు ఇలా చెత్తసంపద కేంద్రం, నేడు తొలగించిన ప్రదేశం

వంగర, జనవరి 9: అరసాడలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన చెత్త సంపద కేంద్రం ఆదర్శంగా నిలిచింది. ఇటీవల కొందరు నాయకులు టీడీపీ నిర్మించిందనే ఉద్దేశంతో దానిని తొలగించడానికి ప్రణాళికలు తయారు చేశారు. ఆ స్థానంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించాలని సిద్ధమయ్యారు. ఆ భవనాన్ని తొలగించడం అంత సులువు కాదని.. ఉన్నతాధికారుల అనుమతులు ఉండాలని మండల నాయకులు చెప్పినా ఆ నాయకులు వినలేదు. ఆ తరువాత కాంట్రాక్టరుతో సంప్రదించిన నాయకుడు పనులు ప్రారంభించాలని చెప్పాడు. ఇక్కడే సమస్య ప్రారంభమైంది. ప్రభుత్వ భవనం మంజూరుకు సంబంధిత గ్రామ పంచాయతీతో పాటు మరికొందరు అభ్యంతర పత్రం ఇవ్వాలి. ఆ తరువాత ప్రభుత్వం పరిశీలించి.. భవన మంజూరుకు అనుమతులు ఇస్తుంది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నాయకులు గ్రామ సమీపంలో అభ్యంతరం పత్రం ఇచ్చారు. అక్కడ నిర్మాణాలు చేపట్టకూడదనే ఉద్దేశంతో ఆ నాయకుడు చెత్త సంపద కేంద్రాన్ని తొలగించేందుకు ప్లాన్ చేశాడు. ఈ విషయం తెలుసుకున్న కాంట్రాక్టర్ నిర్మాణానికి ముందుకు రాలేదు. దీంతో ఉన్నది పోయింది... కొత్తది రాకుంది అన్న చందంగా మారింది. చెత్త సంపద కేంద్రం తొలగింపుపై పంచాయతీ అధికారి త్రినాథ వద్ద ‘ఆంధ్రజ్యోతి’ ప్రస్తావించగా... దీన్ని తొలగించే అధికారం తమకు గానీ... నాయకులకు గానీ లేదన్నారు. తొలగించినట్లయితే సంబంధిత అధికారులకు నోటీసులు ఇచ్చి వివరణ కోరుతామన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని చెప్పారు.

పోరాటం ఉధృతం చేస్తాం

- కొనసాగిన మునిసిపల్ కార్మికుల నిరసన


రాజాంలో మాట్లాడుతున్న రామ్మూర్తినాయుడు


బొబ్బిలి: నిరసన తెలుపుతున్న కార్మికులు

రాజాం రూరల్: కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు తెలిపారు. మంగళవారం ము నిసిపల్ కార్మికుల సమ్మె శిబిరంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షనేతగా ఆచరణ సాధ్యంకాని హామీలిచ్చి, అధికారం లోకి వచ్చి ఐదేళ్లు పూర్తవుతున్న సమయంలో ఆర్థికపరమైన అంశాలు ఇప్పుడు అమలు చేయలేమని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేర్కొనడం విడ్డూ రంగా ఉందన్నారు. ● **బొబ్బిలి:** తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికుల దీక్షలు మంగళవారం కొనసాగాయి. పంగనామాలు పెట్టుకుని నిరసన తెలుపుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

మొండి వైఖరి విడనాడాలి

- సమస్యలు పరిష్కరించేంత వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తాం
- 29వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

ప్రభుత్వం అంగన్‌వాడీలపై మొండి వైఖరి విడనాడాలని యూనియన్ నాయకురాలు అన్నారు. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారంతో 29వ రోజు చేరింది. తమ సమస్యలను పరిష్కరించేంతవరకు సమ్మె విరమించేది లేదని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఎస్మా జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా వివిధ రకాలుగా నిరసన తెలియజేశారు.

(ఆంధ్రజ్యోతి బృందం)


రామభద్రపురం: ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


బాడంగి: అంగన్‌వాడీలను ఉద్దేశించి మాట్లాడుతున్న సంఘ నాయకులు



ఎస్.కోట: ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు


గజపతినగరం: కొంగు చాచి భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు



చీపురుపల్లి: మోకాళ్లపై కూర్చొని దండాలు పెడుతున్న అంగన్‌వాడీలు


భోగాపురం: కోలాటం ఆడుతూ నిరసన


జామి: పిడకలు తయారుచేస్తూ నిరసన


కొత్తవలస: ఒంటి కాళ్లపై నిలబడి దండాలు పెడుతూ..


రాజాం రూరల్: నిరసన చేస్తున్న అంగన్‌వాడీలు

తాగునీటి కోసం మహిళల ఆందోళన


ఆందోళన చేస్తున్న హరిజన వీధి మహిళలు

రాజాం: పురపాలక సంఘం పరిధిలో నాలుగు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో మంగళవారం మహిళలు ఆందోళనకు దిగారు. కనీసం మంగళవారమైనా కొళాయిలు ద్వారా తాగునీరు సరఫరా అవుతుందని, ఖాళీ కుండలు పట్టుకొని మహిళలు ఎదురుచూశారు. ఉదయం 11 గంటల వరకు తాగునీరు రాకపోవ డంతో హరిజన వీధికి చెందిన మహిళలు పత్తిమ్మ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. తాగునీటి సరఫరా చేయకపోతే కార్యాలయం ముందు ఖాళీ బిందెల తో ధర్నా చేపడతామని హెచ్చరించారు.

ఉంగరాడలో రేషన్ పంపిణీపై విచారణ


వివరాలు నమోదుచేస్తున్న అధికారులు

రేగిడి: ఉంగరాడలో రేషన్ పంపిణీపై ఆర్‌ఐ రేవతి, వీఆర్వో సన్నందొర మంగళవారం విచారణ నిర్వహించారు. మూడు నెలలుగా తమ గ్రామంలో ఎండీఎం ఆపరేటర్, డీలర్లు రేషన్ సక్రమంగా పంపిణీ చేయడం లేదని కలెక్టర్ స్పందనకు, 1902 ఫోన్‌కాల్‌కు గ్రామానికి చెందిన దూబ గణపతిరావు, మరికొంతమంది లబ్ధిదారులు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ నిర్వహించారు. ఫిర్యాదుదారుల నుంచి స్టేట్‌మెంట్ రికార్డుచేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆర్‌ఐ, వీఆర్వో తెలిపారు.

మాతా శిశు సంరక్షణపై శ్రద్ధ


సేవలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌వో

జామి: పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది మాతా శిశు సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎస్.భాస్కర రావు అన్నారు. మంగళవారం ఆయన జామి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో అమలవుతున్న ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమ నిర్వహణ తీరును పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా పొన్నాకుల హారతి


స్వామివారికి హారతి ఇస్తున్న దృశ్యం

బొబ్బిలి: ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీమన్నారాయణునికి పొన్నాకుల హారతి కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. స్థానిక శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో వేకువజామున వందలాది మంది భక్తులు పొన్నాకులలో హారతి వెలిగించి స్వామివారికి నివేదించారు. కంచరవీధి శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి, సింగారపు వీధి శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లోనూ పొన్నాకుల హారతిని నిర్వహించారు.

గెడ్డ ఆక్రమణల తొలగింపు


గెడ్డలో నిర్మించిన పాకలను తొలగిస్తున్న దృశ్యం

శృంగవరపుకోట: స్థానిక చెరకు కాటా వద్ద గెడ్డను ఆక్రమించి నిర్మించిన పాకలను మంగళవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'గెడ్డ.. ఆక్రమణదారుల గడ్డ' అనే శీర్షికతో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనికి స్పందించిన అధికారులు గెడ్డలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను ధ్వంసం చేస్తున్నారు. చెరకు కాటా వద్ద గెడ్డను ఆక్రమించి న వారంతా పేదలు. వీరికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలను కేటాయించకపోవడంతో ఇక్కడ పాకలు వేశారు. తహసీల్దార్ డి.శ్రీనివాసరావుకు ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. ఇళ్ల స్థలాలను కేటాయించిన తరువాతే వీటిని తొలగిస్తామని పేర్కొన్నా రు. అయినప్పటికీ బలవంతంగా వీటన్నిటినీ ప్రొక్లయినర్లతో తొలగించడంతో వారంతా ప్రతిఘటించారు. దీంతో కొంత వివాదం నెలకొంది. తహసీల్దార్‌తో పాటు ఉప తహసీల్దార్ భరత్‌కుమార్, ఏఎస్‌వో రమేష్‌రాజు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కేంద్ర పథకాలను వినియోగించుకోండి

కొత్తవలస: ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్.కోట బీజేపీ ఇన్‌చార్జి వైప్రసాద్ పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా దేవాడ, ముసిరాం సచివాలయాల్లో సర్పంచ్‌లు జి.జయకుమారి, చింతల రాములమ్మ, ఎంపీటీసీ ఓ.వరలక్ష్మి, కార్యదర్శులు చిన్నారావు, శంకరరావుల ఆధ్వర్యంలో మంగళవారం స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ నేతృత్వంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జన్‌ధన్ యోజన, అర్హులైన మహిళలకు ఉచిత గ్యాస్, ప్రధానమంత్రి వందన పథకం తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సీహెచ్ అప్పారావు, మాన్యం దేముడు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రేగిడిలో సోషల్ ఆడిట్ ప్రజావేదిక

రేగిడి: రేగిడిలో 2022-23 వార్షిక ఏడాదికి సంబంధించి ఉపాధి హామీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, సమగ్రశిక్ష శాఖల్లో ఖర్చుచేసిన రూ.19.05 కోట్లపై బుధవారం సోషల్ ఆడిట్ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీవో ఎస్.హరనాథ్ మంగళవారం తెలిపారు. గత నెలలో 17 రోజులపాటు వివిధ గ్రామాల్లో ఎస్‌ఆర్‌పీ మాధవ్, డీఆర్‌పీలకు చెందిన ఎనిమిది బృందాలు సేకరించిన వివరాలు సోషల్ ఆడిట్‌లో అధికారుల సమక్షంలో చర్చిస్తారని చెప్పారు.

శాశ్వత రహదారి నిర్మించండి

మక్కువ: మక్కువలో కనీసం రోడ్డయినా నిర్మించడం మహాప్రభో అని టీడీపీ మండల నాయకుడు మావుడి ప్రసాదరావు కోరారు. మక్కువలో జరుగుతున్న రోడ్డు మరమ్మతులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడారు. కనీసం ప్రధాన రహదారిలోనైనా తాత్కాలిక మరమ్మతులు కాకుండా శాశ్వత రహదారి నిర్మించాలని డిమాండ్ చేశారు. రోడ్డు మరమ్మతులు చేపడితే అనవసరంగా కాలువలు ఎందుకు తవ్వుతున్నారని ప్రశ్నించారు. మండల కేంద్రంలోని రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉన్నాయని, వీధి లైట్లు వెలగడం లేదని, ప్రధాన రహదారి శిథిలావస్థకు చేరుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులు ఎప్పటికి మారుతాయోనని ఆవేదన వ్యక్తం చేశారు.

తుగ్లక్ పాలనకు చరమగీతం పలకాలి

గరుగుబిల్లి: రాష్ట్రంలోని తుగ్లక్ పాలనకు ప్రజలు చరమ గీతం పాడాలని టీడీపీ అరకు బీసీ సెల్ అధికార ప్రతినిధి డి.సత్యనారాయణ అన్నారు. మంగళవా రం శివ్వాం గ్రామంలో ఆయన మాట్లాడుతూ.. బొబ్బిలిలో జరగనున్న టీడీపీ సభ ను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రతినిధులు నారాయణస్వామి, బలరాం నాయుడు, మోహనరావు, చంద్రరావు, సింహాచలంనాయుడు, ఆదినారాయణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సత్యనారాయణ

టీడీపీలో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోండ్రు

రేగిడి: మునకలవలస మాజీ సర్పంచ్ శాసపు జనార్దనరావు, అదే పంచాయతీ బాలికావలసకు చెందిన ఉపసర్పంచ్ ఏనుగుల కార్తీక్ తన అనుచరులతో టీడీపీలో చేరారు. ఈ మేరకు రాజాం క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాత్రి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ కండువాలు వేసి ఆహ్వానించారు. వీరితోపాటు బాలికావలసకు చెందిన డోల గణనాద, కోడిశ రాంబాబు, బిల్లాన రమణ, ఏనుగుతల నారాయణరావు, డోల అప్పలనాయుడు, డోల శ్యామ్, ఇజ్జాడ మహీంద్ర పార్టీలో చేరారు. ఈ కార్య క్రమంలో రాజాం, రేగిడి పార్టీ నాయకులు గురువాన నారాయణరావు, కిమిడి అశోక్‌కుమార్, దూబ ధర్మారావు, గురువాన ధనంజయ్ పాల్గొన్నారు.

చంద్రబాబు దృష్టికి మా సమస్యలు తీసుకువెళ్తాం

- ఏపీ సొండి కుల సంక్షేమ సంఘ జనరల్ సెక్రటరీ రాజారావు



బొబ్బిలి: ప్రజాగర్జన సభకు బుధవారం బొబ్బిలి విచ్చేస్తున్న తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు దృష్టికి తమ కులానికి చెందిన ప్రధాన సమస్యలను తీసుకెళతామని ఏపీ సొండి కుల సంక్షేమ సంఘ జనరల్ సెక్రటరీ బి.రాజారావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో సొండి కులానికి చెందిన వారు సుమారు లక్ష జనాభా వరకు ఉన్నారన్నారు. గత 40 ఏళ్ల నుంచి సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నామన్నారు. తెలంగాణలో మాదిరిగా సొండి కులం వారికి మద్యం షాపుల కేటాయిం పులో రిజర్వేషన్ కల్పిస్తామని చంద్రబాబు పార్వతీపురం బహిరంగ సభలో హామీ ఇచ్చారని.. దానిని నెరవేర్చాలని కోరారు. సొండి కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. తమను బీసీ-ఏలో చేర్చాలని కోరుతూ సొండి కుల పెద్దలు బుధవారం బొబ్బిలిలో చంద్రబాబుకు వినతిపత్రం అందిస్తారని ఆయన చెప్పారు.

జనసేనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం


నానిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాధవి

నెల్లిమర్ల: రాష్ట్రాభివృద్ధి జనసేనతోనే సాధ్యమని ఆ పార్టీ నాయకురాలు లోకం మాధవి అన్నారు. నెల్లిమరలో మంగళవారం జనసేన ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం యూనియన్ బ్యాంకు సమీపంలో ని మైదానంలో బహిరంగ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడారు. వైసీపీ అరాచక పాలనను అంతమొందించడానికే జనసేన, టీడీపీతో పొత్తు పెట్టుకున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్లకు చెందిన వైసీపీ యువ నాయకుడు రవ్వా నాని ఆ పార్టీని వదిలి జనసేనలో చేరారు. నానికి ఆమె పార్టీ కండువా కప్పి, జనసేనలోకి ఆహ్వానించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకుడు లోకం ప్రసాద్, కరుమజ్జి గోవింద్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోనంగిపాడులో 'జన నాయకుని కోసం జనం బాట'


కోనంగిపాడులో జనసేన నాయకులు

వంగర: వైసీపీ అరాచక పాలనలకు ప్రజలు విసుగు చెందారని, త్వరలో ఇంటికి పంపడానికి సిద్ధంగా ఉన్నారని జనసేన రాజాం నియోజక వర్గ నాయకుడు ఎన్ని రాజు తెలిపారు. మంగళవారం కోనంగిపాడులో జన నాయకుని కోసం జనంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ టీడీపీ, జనసేన కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసి ప్రజల సమస్యలు గుర్తించి పరిష్కరిస్తామన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ త్రివినాగ్

చీపురుపల్లి: ఓటరుగా నమోదైన ప్రతిఒక్కరూ విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ట్రైనీ కలెక్టర్ బి.వెంకట్ త్రివినాగ్ అన్నారు. ఓటరు ఎవేర్‌నెస్ ఫోరం ఆధ్వర్యంలో పత్తికాయవలస సమీపంలోని నార్త్ కోస్టల్ ఫుడ్ పార్క్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 18 ఏళ్ల వయసు పూర్తయిన వారంతా తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి ఆర్డీవో బి.శాంతి, తహసీల్దార్ ఎం.సురేష్, ఉప తహసీల్దార్ సంతోష్, ఇతర అధికారులు, యాజమాన్యం ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

బొండపల్లి: రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని సేకరించేలా మిల్లర్లు అన్ని చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోగల మిల్లర్ల యజమానులతో తహసీల్దార్ డీజీఎంఎస్ ప్రసాదరావుతో కలిసి కొనుగోలుకు సంబంధించి సమావేశం నిర్వహించారు. వేబ్రిడ్జిలో తేడాలు రాకుండా అన్ని చర్యలను మిల్లర్లు తీసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రైతులు నుంచి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. మండలంలోని అన్ని మిల్లర్లకు ఇప్పటివరకు సేకరణకు సంబంధించి టార్గెట్ పూర్తి అయిందని, టార్గెట్ పెంచేలా సివిల్‌సప్లై అధికారులు చర్యలు తీసుకోవాలని మిల్లర్లు ఎంపీపీ, తహసీల్దార్ దృష్టికి తమ సమస్యలను తీసుకువచ్చారు. ఈమేరకు టార్గెట్ పెంచడానికి అన్ని చర్యలు తీసుకున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిల్లర్ల యజమానులు మీసాల తులసీరాం, దేవుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముని అక్షింతల పంపిణీ


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

విజయనగరం రూరల్: అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు, చిత్రపటాలు, కరపత్రాలను కొత్తపేట కోదండ రామాలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. తొలుత ఆలయంలో పూజలు చేసి.. అనంతరం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రామాలయ ప్రారంభోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కోదండ రామాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పైడిమాంబకు ప్రత్యేక పూజలు


పైడిమాంబను వివిధ పుష్పాలతో అలంకరించిన దృశ్యం

విజయనగరం రూరల్: పైడిమాంబ చదురుగుడిలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని అలంకరించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పైడిమాంబను దర్శించుకున్నారు. ఉదయం 5.45 గంటలకు సుప్రభాత సేవ అనంతరం సాధారణ భక్తులకు దర్శనం కల్పించారు.

క్లుప్తంగా..

మొయిదలో 'ఆరోగ్య సురక్ష'

నెల్లిమర్ల: మొయిద విజయరాంపురంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్సీ సురేష్‌బాబు ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గదల సన్యాసినాయుడు, డీసీసీబీ వైస్ చైర్మన్ చనమల్లు వెంకటరమణ, సర్పంచ్ అట్టాడ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పల్లిపేటలో పశు వైద్య శిబిరం

నెల్లిమర్ల: పశు సంవర్ధక శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అలుగోలు పంచాయతీ పల్లిపేటలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వైస్ ఎంపీపీ సారికి వైకుంఠంనాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సుమారు 58 పశువులకు వైద్యం చేశారు. అవసరమైన వాటికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అలుగోలు బంగారమ్మ, సతివాడ పశువైద్య కేంద్రం వైద్యుడు కూరెళ్ల ప్రవీణ్ కుమార్, రిలయన్స్ ప్రతినిధి డి.సురేష్ పాల్గొన్నారు

83మందికి వైద్య పరీక్షలు

చీపురుపల్లి: చీపురుపల్లి లయన్స్ క్లబ్‌లో లయన్స్, స్టార్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 83 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, ఇందులో ఆరుగురికి తదుపరి పరీక్షలు అవసరమని గుర్తించారు. 28 మందికి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాయి సూపర్ స్పెషాలిటీ వైద్యులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్బీకేలో టీవీ, కంప్యూటర్ చోరీ

దత్తిరాజేరు: వి.కృష్ణాపురంలోగల రైతు భరోసా కేంద్రంలో టీవీ, కంప్యూటర్‌కు సంబంధించిన డెస్క్‌టాప్ చోరీ అయినట్లు మండల వ్యవసాయ అధికారిణి అనూరాధ మంగళవారం విలేకర్లకు తెలిపారు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్టు పెదమానాపురం పోలీసులకు ఇన్‌చార్జి ఏఈవో నీలాకృష్ణ ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ప్రభుత్వం ఆస్తులను చోరీ చేసినవారిని పట్టుకుని, ప్రభుత్వ ఆస్తిని కాపాడాలని కోరారు.

సర్వీసు రోడ్ల విస్తరణ ఎప్పుడో?

- ముగింపు దశలో జాతీయ రహదారి విస్తరణ పనులు


కొటారుబిల్లి-లక్కిడాం సర్వీసు రోడ్డు,


కొటారుబిల్లిలో జాతీయ రహదారి విస్తరణకు అండర్ డ్రైనేజీ పనులు జరుగుతున్న దృశ్యం

గంట్యాడ: కొటారుబిల్లి కూడలికి దాదాపు 30 గ్రామాల ప్రజలు వివిధ అవసరాలపై వచ్చి- వెళుతుంటారు. దీంతో ఈ కూడలి నిత్యం జనాలతో కిటకిటలాడుతుంది. ప్రధానంగా బుడతనాపల్లి వైపు గ్రామాలకు వెళ్లే సర్వీసు రోడ్డు, లక్కిడాం వైపు వెళ్ళే సర్వీసు రోడ్లు విస్తరించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం రామవరం నుంచి చిలకలగెడ్డ వరకూ రహదారి విస్తరణ జరుగుతోంది. 2021లో మొదలుపెట్టిన పనులు చివరి దశకు వచ్చాయి. సుమారు రూ.86 కోట్లతో 26 కిలోమీటర్ల దూరం రహదారి విస్తరణ జరుగుతోంది. రామవరం నుంచి ఎస్.కోట మండలం బొడ్డవరం వరకూ సుమారు 26 ఎకరాల భూమిని దాదాపు 400 మంది నుంచి సేకరించారు. ఇందులో పది ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా... మిగిలినది జిరాయితీ. ఈ రహదారిలో కొర్లాం, తామరాపల్లి, నరవ వంటి కూడళ్లలో సర్వీసు రోడ్లు కాస్త విస్తరించారు. నిత్యం జనాలతో కిటకిటలాడే కొటారుబిల్లి కూడలిలో సర్వీసు రోడ్డు విస్తరణకు ఎటువంటి పనులు మొదలు కాలేదు. ఇక్కడ సర్వీసు రోడ్డును విస్తరించాలంటే ముందుగా భూసేకరణ చేయాలి. సంబంధిత స్థలాల్లో ఉన్నవారిని ఖాళీ చేయించాలి. ఈ ప్రక్రియ జరగకపోవడంతో సర్వీసు రోడ్డు నిర్మాణం జరుగుతుందా.. లేదా అనే దానిపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కూడలిలో సర్వీసు రోడ్లను విస్తరించాలని స్థానికులు కోరుతున్నారు. ● ఈ విషయమై నేషనల్ హైవే జేఈ ప్రకాష్ వద్ద ప్రస్తావించగా కొటారుబిల్లి కూడలిలో లక్కిడాం, బుడతనాపల్లి వెళ్లే సర్వీసు రోడ్ల విస్తరణపై మొదట్లో ప్రతిపాదనలు చేయలేదని వెల్లడించారు.

పార్క్ సుందరీకరణ పూర్తి చేయాలి

గుమ్మలక్ష్మీపురం/కురుపాం: ఎస్‌కేపాడు పార్క్ సుందరీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ ఆదేశించారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో ఆయుష్మాన్‌భారత్ ప్రక్రియను, ఎస్‌కేపాడు ఉద్యాన నర్సరీలో చేపడుతున్న పర్యాటక సుందరీకరణ పనులను మంగళవారం పరిశీ లించారు. పర్యాటక నిలయంగా ఈ ప్రాంతం మారాలని, ఇక్కడ ప్రకృతి రమణీయత, వాగులు, జలపాతాలు ఆహ్లాదాన్ని కలిగిస్తాయన్నారు. కాగా ఆయుష్మాన్ భారత్ కార్య క్రమం కింద పీవీటీజీలను నమోదు చేయాలని, ఈ-కేవైసీ చేయాలని పీవో ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో, పంచాయతీ సెక్రటరీ, సంక్షేమ సహాయకులు పాల్గొన్నారు.